
# ‘పట్నం’ కాంగ్రెస్‌కు అసమ్మతి సెగ

- అట్టుడుకుతున్న ఇబ్రహీంపట్నం ‘కాంగ్రెస్’
- మల్‌రెడ్డికి టికెట్ కేటాయింపుతో పార్టీ నేతల్లో కొనసాగుతున్న అసంతృప్తి
- మల్‌రెడ్డి నిర్వహించిన సమావేశానికి ఎంపీ కోమటిరెడ్డితోపాటు మల్రి, దండెం డుమ్మా..
- రెండు రోజుల క్రితం గాంధీభవన్ వద్ద తన అనుచరులతో దండెం రాంరెడ్డి ఆందోళన
- ఎన్నికల వేళ .. నియోజకవర్గంలో రోజురోజుకూ దయనీయంగా మారుతున్న కాంగ్రెస్ పరిస్థితి



రంగారెడ్డి, నవంబర్ 3(నమస్తే తెలంగాణ): ‘రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కాంగ్రెస్‌లో అసమ్మతి రాగం సెగలు రేపుతున్నది. కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన రెండో జాబితా నుంచి మొదలైన అసమ్మతి మంటలు నేటికీ చల్లారడం లేదు. ఎంతోకాలంగా ఇక్కడి కాంగ్రెస్ నేతల మధ్య ఉన్న ముసలం.. టికెట్ కేటాయింపు తర్వాత మరింత రగడలా మారింది. కాంగ్రెస్ అధిష్టానం మల్‌రెడ్డి రంగారెడ్డి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసి అసమ్మతికి మరింత ఆజ్యం పోసిందన్న విమర్శలు పార్టీ క్యాడర్‌లో వ్యక్తమవుతున్నాయి. అసమ్మతి నేతల్లో ఒకరైన దండెం రాంరెడ్డి రెండు రోజుల క్రితం గాంధీభవన్ వద్ద తన అనుచరులతో కలిసి తీవ్ర స్థాయిలో నిరసన గళం వినిపించారు. ఇదే క్రమంలో శుక్రవారం తుర్కయాంజాల్‌లో కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి సైతం దండెం రాంరెడ్డి గైర్హాజరయ్యారు. ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితోపాటు మరో అసమ్మతి నేత మల్రి నిరంజన్ రెడ్డి సైతం ఈ సమావేశానికి హాజరుకాకపోవడంపై తీవ్ర చర్చ జరుగుతున్నది.’

**అసమ్మతి చిచ్చు ఇప్పట్లో చల్లారేనా..?**

ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీలో టికెట్ చిచ్చు రగులుతూనే ఉన్నది. ప్రస్తుత పరిస్థితులను చూస్తే అసమ్మతి మంటలు ఇప్పట్లో చల్లారేలా కనిపించడం లేదు. మొదటి నుంచీ నియోజకర్గంలో టికెట్ విషయంలో తీవ్ర పోటీ నెలకొన్నది. ఏడుగురు దరఖాస్తు చేసుకోగా.., ప్రధానంగా ఇద్దరు ముగ్గురు నేతల మధ్యనే పోటీ సాగింది. మల్‌రెడ్డి రంగారెడ్డి టీపీసీసీ చీఫ్ రేవంత్ వర్గంలో ఉంటే.. దండెం రాంరెడ్డి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో, మల్రి నిరంజన్‌రెడ్డి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో టచ్‌లో ఉన్నారు. ఈ ముగ్గురూ ఎవరికివారుగా తమ నేతలతో టికెట్ కోసం ప్రయత్నాలు చేయగా.. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం మల్‌రెడ్డి రంగారెడ్డి అభ్యర్థిత్వం వైపే మొగ్గు చూపింది. తనకే టికెట్ వస్తుందని ఆశ పెట్టుకున్న దండెం రాంరెడ్డి, మల్రి నిరంజన్‌రెడ్డిలకు అధిష్టానం నిర్ణయం కంగుతినేలా చేసింది. మల్రి నిరంజన్‌రెడ్డి మౌనంగానే ఉంటున్నప్పటికీ పార్టీ కార్యక్రమాలకు మాత్రం దూరంగా ఉంటూ వస్తున్నారు. దండెం రాంరెడ్డి గతంలోనే తన అనుచరులతో సమాలోచనలు జరిపి టికెట్ విషయంలో పునరాలోచించాలని అధిష్టానానికి అల్టిమేటం కూడా జారీ చేశారు. ఆ తర్వాత గాంధీ భవన్ వద్ద దండెం రాంరెడ్డి తన వర్గీయులతో కలిసి ఆందోళన చేపట్టారు. రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీలను దహనం చేసి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది జరిగిన మరుసటి రోజే శుక్రవారం మల్‌రెడ్డి రంగారెడ్డి తుర్కయాంజాల్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఎల్బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కి, కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు శేఖర్‌గౌడ్, లక్ష్మీపతిగౌడ్, మల్‌రెడ్డి రాంరెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశానికి అసమ్మతి నేతలు దండెం రాంరెడ్డి, మల్రి నిరంజన్ రెడ్డిలు హాజరు కాలేదు. స్థానిక ఎంపి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సైతం డుమ్మాకొట్టడం పార్టీ శ్రేణుల్లో తీవ్ర చర్చ జరుగుతున్నది. తన అనుచరుడికి టికెట్ దక్కకపోవడం వల్లనే ఆయన డుమ్మా కొట్టారన్న ప్రచారం జరుగుతున్నది.

**ఎన్నికల్లో కలిసి పనిచేసేనా..?**

మొదటినుంచీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కాంగ్రెస్ వర్గపోరుకు కేరాఫ్‌గా ఉంటూ వస్తున్నది. ఇక ఎన్నికల వేళలోనూ..సద్దుమణగక నేటికీ ఆ పార్టీ గ్రూపుల గొడవలతో సతమతమవుతున్నది. ఈ వ్యవహారం కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డికి తలనొప్పిగా మారింది. గతంలో మలక్‌పేట్ ఎమ్మెల్యేగా పనిచేసిన ఈయన ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి బీఎస్పీ, కాంగ్రెస్ తరపున రెండుసార్లు పోటీచేసి ఓడిపోయారు. ఒకసారి మహేశ్వరం నుంచి కూడా పోటీచేసి ఓటమి పాలయ్యారు. మరోసారి అదృష్టాన్ని పరిక్షించుకునేందుకు ఇబ్రహీంపట్నం నుంచి ఎన్నికల బరిలో నిలిస్తే.. అసమ్మతి నేతలెవరూ కలిసిరాకపోవడం ఆయనను అంతర్మథనంలో పడవేస్తున్నది. పార్టీ నేతలందరినీ ఒక్కతాటిపైకి తీసుకురావడం మల్‌రెడ్డికి పెద్ద సవాల్‌గా మారింది. దీంతో ఎన్నికల నోటిఫికేషన్ విడుదయ్యాక కూడా ప్రచారం మొదలుపెట్టలేని పరిస్థితి నెలకొంది. అసమ్మతి నేతలను కలుపుకు పోతారా? లేక.. పోతే పోనీలే అన్నట్లుగా వ్యవహరిస్తారా? అన్నది వేచి చూడాల్సిందే. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి తన శ్రేణులతో కలిసి ప్రచారంలో దూసుకుపోతుండగా.. కాంగ్రెస్‌లో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులు ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కాంగ్రెస్ క్యాడర్‌ను సైతం అయోమయానికి గురిచేస్తున్నాయి.

## ముమ్మరంగా వాహనాల తనిఖీలు

**తాండూరులో 21 తులాల బంగారం సీజ్**

తాండూరు, నవంబర్ 3: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తాండూరు నియోజకవర్గంలో పోలీసులు వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు. శుక్రవారం తాండూరు మండలం ఖాంజాపూర్ గేటు వద్ద 21 తులాల బంగారాన్ని పోలీసులు పట్టుకొని సీజ్ చేశారు. వారి వద్ద సరైన ఆధారాలు లేకపోవడంతో పోలీసులు స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు సీఐ రాజేందర్‌రెడ్డి తెలిపారు. స్క్రీనింగ్ కమిటీ ముందు ప్రొడ్యూస్ చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



# ఎన్నికల ఖర్చులపై పరిశీలన

**కలెక్టరేట్‌ను సందర్శించిన ఎన్నికల వ్యయ పరిశీలకులు మునీష్ రజిని**

వికారాబాద్, నవంబర్ 3 : జిల్లా అసెంబ్లీ ఎన్నికల వ్యయ పరిశీలకులు మునీష్ రజిని శుక్రవారం కలెక్టరేట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ ఎన్నికల్లో బరిలో ఉండే వివిధ రాజకీయ పార్టీల, అభ్యర్థులకు సంబంధించి ఎన్నికల ప్రవర్తన నియమావళిని అనుసరించి చేస్తున్న ఖర్చులపై ఎంసీసీ వ్యయ విభాగంలో నిర్వహిస్తున్న రికార్డులను వ్యయ పరిశీలకులు పరిశీలించారు. వార్తాపత్రికల్లో, ప్రసార మాధ్యమాల్లో వస్తున్న వార్తలపై ఆరా తీశారు. ఎంసీఎంసీ ద్వారా ప్రచారం నిమిత్తం ఇచ్చే అనుమతులు, ప్రకటనలు తదితర అంశాలను వారు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లోనీ చెక్ పోస్టులను కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ ద్వారా పరిశీలించారు. అదేవిధంగా 1950 కాల్ సెంటర్, సి- విజిల్ ద్వారా వచ్చే ఫిర్యాదులపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో ఎన్నికల నిర్వహణకు సంబంధించి పూర్తిస్థాయిలో అధికారులు నియమించడం జరిగిందని, అబ్జర్వర్‌కు తెలిపారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో పూర్తి స్థాయిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఎన్నికల వ్యయ పరిశీలకులు సందర్శనలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ నారాయణ అమిత్, ఎంసీసీ నోడల్ అధికారి కృష్ణన్, ఎక్స్‌పెండెచర్ నోడల్ అధికారి శంకరాచారి, ఎంసీఎంసీ నోడల్ అధికారి ఆరిఫొద్దీన్ ఇతర ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

# ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ విడుదల

**ప్రారంభమైన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ**

**తొలి రోజు మూడు నామినేషన్లు దాఖలు**

రంగారెడ్డి, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ) : శాసనసభ ఎన్నికలకు సంబంధించి శుక్రవారం ఎన్నికల అధికారులు గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. అనంతరం ఫామ్-1 నోటీసులు జారీ చేశాక నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను మొదలుపెట్టారు. తొలిరోజు ఇబ్రహీంపట్నం, చేవెళ్ల, కల్వకుర్తి శాసనసభ స్థానాలకు ఒక్కొక్క నామినేషన్ చొప్పున మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. ఇబ్రహీంపట్నం శాసనసభ స్థానానికి ఉండ్యాల సదానందరెడ్డి(పీపుల్ ప్రొటెక్షన్ పార్టీ), కల్వకుర్తి శాసనసభ స్థానానికి బాదేపల్లి రాజు(స్వతంత్ర అభ్యర్థి), చేవెళ్ల శాసనసభ స్థానానికి కేఎస్ రత్నం(బీజేపీ పార్టీ) ఆయా రిటర్నింగ్ అధికారులకు నామినేషన్ పత్రాలను సమర్పించారు.

**వ్యయ పరిశీలకుల నియామకం..**

రంగారెడ్డి జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీల ఎన్నికల నిర్వహణను పర్యవేక్షించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం వ్యయ పరిశీలకులను నియమించింది. ఇబ్రహీంపట్నం, ఎల్బీనగర్ అసెంబ్లీలకు ప్రియరంజన్ శ్రీవాస్తవ, కల్వకుర్తి, షాద్‌నగర్‌లకు వినోద్‌కుమార్ అహిర్వార్, మహేశ్వరం, రాజేంద్రనగర్‌లకు శంకర్‌గుప్తా, శేరిలింగంపల్లి, చేవెళ్లలకు జనార్దన్ నియామకమయ్యారు.

# రంగారెడ్డి జిల్లా వ్యయ పరిశీలకుల నియామకం



సెక్టోరియల్ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ భారతిహోలీకేరి

ఇబ్రహీంపట్నం, నవంబర్ 3 : రంగారెడ్డి జిల్లాలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల కోసం కేంద్ర ఎన్నికల వ్యయ పరిశీలకులుగా ఇండియన్ రెవెన్యూ సర్వీసెస్‌కు చెందిన ప్రియరంజన్ శ్రీవాస్తవ, వినోద్ కుమార్ హర్వార్‌లను భారత ఎన్నికల కమిషన్ నియమించిందని రంగారెడ్డిజిల్లా కలెక్టర్ భారతిహోలీకేరి తెలిపారు. శుక్రవారం జిల్లాకు చేరుకున్న వ్యయ పరిశీలకులు ప్రియరంజన్ శ్రీవాస్తవ, వినోద్ హర్వార్‌లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోలీకేరి, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ ఘనంగా స్వాగతం పలికారు. వారు రాష్ట్ర శాసనసభ ఎన్నికలు పురస్కరించుకొని కలెక్టర్ కార్యాలయం సముదాయంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌ను, మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీ సెంటర్‌ను ఎన్నికల వ్యయ పరిశీలకులు పరిశీలించారు. ఎన్నికల సందర్భంగా ఎంసీఎంసీ ద్వారా చేపడుతున్న పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎంసీఎంసీ కేంద్రం నుంచి రికార్డులను ఈ సందర్భంగా వారు తనిఖీ చేశారు. అనంతరం కంట్రోల్‌రూంను పరిశీలించారు.

**పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులపై సమీక్ష..**

జిల్లాలో ఈనెల 30న జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ భారతి హోలీకేరి అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో మౌలిక వసతుల కల్పనపై అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లా పరిధిలోని 8 నియోజకవర్గాల పోలింగ్ కేంద్రాల్లో, పోలింగ్, భద్రతా సిబ్బందికి, ఉద్యోగులకు అవసరమైన తాగునీరు, విద్యుత్, ర్యాంపులు, ఫర్నిచర్, టాయిలెట్స్ వంటి వసతులను ఏర్పాటు చేయాలన్నారు. పట్టణ కేంద్రాల్లో మున్సిపల్ అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ర్యాంపులను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. పంచాయతీ ఇంజినీరింగ్ వారు వీటి ఏర్పాట్లపై శ్రద్ధ చూపాలన్నారు. సమావేశంలో జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**WANTED**

★ రామకృష్ణ గ్రూప్ (TS & AP No. 1) Hyd., VJA. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు వర్కర్లు (M/F) కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు కమీషన్: 5,000/-. Ph: 9281452833, 6281208600.
NT-320535

**PLOT FOR SALE**

★ మీ పిల్లల బంగారు భవిష్యత్తు కొరకు అతి తక్కువ ధరలో ప్లాట్లు. 121 చ.గజాల ప్లాట్ రూ. 2 లక్షలు. సెక్యూరిటీ, ఫెన్సింగ్, గేటు, స్పాట్ రిజిస్ట్రేషన్. 8179608180.
NT-317999

**BUSINESS OFFER**

★ ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నాయం, పర్యావరణానికి అనుకూలం. 100% ఆర్గానిక్ విలువలతో తయారవుతున్న *బయోడిగ్రేడబుల్* కవర్లను మార్కెటింగ్ చేయుటకు డిస్ట్రిబ్యూటర్లు, డీలర్లు మరియు మార్కెటింగ్ సిబ్బంది కావలెను. సంప్రదించండి: 9848211153, 9490786468.
NT-320324-All

**KIDNEY STONES**

★ మూత్ర పిండాల్లో రాళ్ల సమస్యకు ఆపరేషన్ లేని హోమియో పరిష్కారం. 47 సం||, అనుభవంతో 100% గ్యారంటీ. జయసూర్య హోమియో క్లినిక్ A Centre for Kidny Stones Opp: రైల్వే డిగ్రీ కాలేజ్, మెట్రో పిల్లర్ నెం. 1058, తార్నాక, సికింద్రాబాద్. Ph: 9866007924, 9550336677, 040-27000580.
NT-320707

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు,
వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు
మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి : 80966 77665
తాండూర్/కొడంగల్ : 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962